క్లుప్తంగా

తైక్వాండో పోటీల్లో ప్రతిభ



ప్రతిభ చాటిన బేతంచెర్ల విద్యార్థులు

బేతంచెర్ల: రాష్ట్ర స్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో బేతంచెర్ల విద్యార్థులు సత్తా చాటారు. ఏపీ అమెచ్యూర్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 10, 11వ తేదీల్లో తిరుపతిలో పోటీలు జరిగాయి. ఇందులో కిడ్స్ విభాగంలో జయ ప్రతీక్, సబ్ జూనియర్ విభాగంలో అమృత, క్యాడెట్ విభాగంలో మనస్విని బంగారు పతకాలు సాధించారు. సబ్ జూనియర్ బాయ్స్ విభాగంలో పూర్ణేంద్ర వెండి, ఉత్తేజ్ కుమార్ కాంస్యం, బాలికల విభాగంలో దివ్యశ్రీ బంగారు పతకాలు కైవసం చేసుకున్నారు. మంగళవారం శేషారెడ్డి ఉన్నత పాఠశాలలో ఉమ్మడి జిల్లా అమెచ్యూర్ తైక్వాండో అసోసియేషన్ సెక్రటరీ వెంకటేశ్వర్లు, కోచ్ నాగన్న విద్యార్థులను అభినందించారు.

కోవెలకుంట్ల విద్యార్థికి బంగారు పతకం



బంగారు పతకం సాధించిన కుందన్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం

కోవెలకుంట్ల: స్థానిక సెయింట్ జోసఫ్స్ పాఠశాలకు చెందిన విద్యార్థి తైక్వాండో పోటీల్లో ప్రతిభ కనబరిచినట్లు హెచ్‌ఎం గీతా తెలిపారు. ఈ నెల 11,12వ తేదీల్లో తిరుపతిలో జరిగిన పోటీల్లో తమ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న కుందన్ బంగారు పతకం కైవసం చేసుకున్నాడని చెప్పారు. ఈ మేరకు విద్యార్థిని హెచ్‌ఎంతోపాటు వ్యాయామ ఉపాధ్యాయులు ఓబులేసు, హర్ష తదితరులు అభినందించారు.

చెత్త సంపద కేంద్రాలపై శిక్షణ



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసులు

డోన్ రూరల్: సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణా కార్యక్రమాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం సాంపురం గ్రామంలో చెత్త ఉంచి సంపద తయారీ కేంద్రాలపై అవగాహన కల్పించారు. చెత్త సేకరణ, తడిపొడి చెత్త వేరుచేయడం, ఘన వ్యర్థాల నిర్వహణ, చెత్త నుంచి ఎరువు తయారీ విధానం, వాటి విక్రయం ద్వారా పంచాయతీకి ఆదాయ మార్గం తదితర వాటిపై శిక్షణ ఇచ్చారు. అనంతరం ఎంపీడీఓ శ్రీనివాసులు సర్పంచ్‌లు, కార్యదర్శులతో కలిసి మొక్కలు నాటారు.

పంట నమోదుతోనే రాయితీలు



ఉడుములపాడులో పంట నమోదును పరిశీలిస్తున్న ఏడీఏ

డోన్ రూరల్: రైతులందరూ తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని వ్యవసాయ సహాయ సంచాలకుడు పి.అశోకవర్ధన్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండల పరిధిలోని ఉడుములపాడు గ్రామంలో నిర్వహిస్తున్న పంట నమోదు కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి అబ్దుల్‌షఫీతో కలిసి పరిశీలించారు. రైతులు వేసిన పంట నమోదు చేసుకుంటేనే ప్రభుత్వ నుంచి రాయితీలు అందుతాయని తెలిపారు. గ్రామ వ్యవసాయ సహాయకులు తప్పులకు ఆస్కారం లేకుండా పకడ్బందీగా పంట నమోదు చేయాలన్నారు.

పంట నమోదు తప్పనిసరి



బుగ్గానిపల్లె తండాలో పంట నమోదును పరిశీలిస్తున్న ఏఓ

బేతంచెర్ల: ఈ ఏడాది ఖరీఫ్‌లో పంటలు సాగుచేసిన రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని ఏఓ కిరణ్ కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని బుగ్గానిపల్లె తండా, బేతంచెర్లలో పంట నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు. పంట నమోదు వల్ల పంట నష్టపరిహారం, బీమా, సున్నావడ్డీకి రుణాలు, మద్దతు ధర వంటి ప్రయోజనాలు ఉంటాయని తెలిపారు. రైతు సేవా కేంద్రాల్లో పంట నమోదు చేయించుకోవాలని సూచించారు.

దాడి ఘటనలో ముగ్గురిపై కేసు

బేతంచెర్ల: పట్టణ సమీపంలోని బనగానపల్లె రహదారిలో సోమవారం రాత్రి వ్యక్తిపై దాడి చేసిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ షేక్షావలి మంగళవారం తెలిపారు. వివరాలు.. పట్టణంలోని దుర్గాపేట కాలనీకి చెందిన గజ్జి శ్రీనివాసులును బనగానపల్లె రహదారిలోని పెట్రోల్ బంక్ వద్ద వెళుతున్నాడు. అదే కాలనీకి చెందిన గూటం సాయి, మదన్, శివ దుర్గా ప్రసాద్ గతంలో పెట్టిన కేసు వాపసు తీసుకోవాలని గొడవపడ్డారు. రాళ్లు, రాడ్డుతో కొట్టి గాయపరిచారు. అతన్ని కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరించి చికిత్స అందిస్తున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ వెల్లడించారు.

దేశభక్తి చాటేలా హర్‌ఘర్ తిరంగా



కోవెలకుంట్ల: జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



డోన్‌లో బీజేపీ నాయకులు

- జాతీయ జెండాలతో విద్యార్థుల ర్యాలీ
- 15న ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగురవేయాలని పిలుపు

బనగానపల్లె రూరల్: ప్రతి ఒక్కరూ దేశంపై భక్తి భావం కలిగి ఉండాలని ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ కౌలస్యదేవి అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేశ ఔనత్యాన్ని తెలిపేందుకు ప్రతి ఇంటిపై త్రివర్ణ జెండా ఎగురవేయాలని తెలిపారు. ఈ విషయం ప్రతి భారతీయుడికి తెలియజేసేందుకు విద్యార్థులతో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించినట్లు చెప్పారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బాబునాథ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పంద్రాగస్టు వేడుకలను ఘనంగా నిర్వహించాలి

కోవెలకుంట్ల: ఈ నెల 15 తేదీ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని ప్రిన్సిపాల్ వేణుగోపాల్ అన్నారు. మంగళవారం పట్టణంలోని వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని పురస్కరించుకుని విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు భారత స్వాతంత్రోద్యమ స్ఫూర్తితో దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రామసుబ్బారెడ్డి, వెంకటేశ్వరెడ్డి, భాస్కర్‌రెడ్డి, కృష్ణదాసు, అన్నపూర్ణ, లక్ష్మీదేవి, సంటిరెడ్డి, పుల్లయ్య పాల్గొన్నారు.

దేశ ఐక్యతను చాటాలి

డోన్ టౌన్: ఐక్యతను చాటి చెప్పేందుకు ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేయాలని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ నందు వెంకటరమణ, కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొత్తకాపు



బనగానపల్లెలో ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు

హేమ సుందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. హర్ ఘర్ తిరంగ కార్యక్రమంలో భాగంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు రాజశేఖర్ ఆధ్వర్యంలో పట్టణంలో జాతీయ జెండాలతో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎల్ఐసీ కార్యాలయం వద్ద ఉన్న స్వామి వివేకానంద విగ్రహం నుంచి పాత బస్టాండ్‌లోని మహాత్మాగాంధీ విగ్రహం వరకు ర్యాలీ సాగింది. గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ జిల్లా కార్యదర్శి వడ్డే మహరాజ్, నాయకులు బద్రీ సుధాకర్, రవి కుమార్, మద్దిలేటి పాల్గొన్నారు.

పకడ్బందీగా రెవెన్యూ సదస్సులు

బనగానపల్లె రూరల్: మండలంలో ఈ నెల 16వ తేదీ నుంచి జరిగే రెవెన్యూ సదస్సులను పకడ్బందీగా నిర్వహించాలని డోన్ ఆర్డీఓ మహేశ్వరరెడ్డి ఆదేశించారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సదస్సుల నిర్వహణపై మండల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. ఈ నెల 16వ తేదీ నుంచి సెప్టెంబర్ 27వ తేదీ వరకు ఈ సదస్సులు జరుగుతాయని తెలిపారు. ఆయా గ్రామాల్లో ప్రజలు, రైతుల నుంచి వచ్చే ఫిర్యాదులను నమోదు చేసి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందులో తహసీల్దార్లు, ఆర్ఐలు, సర్వేయర్లతో



అధికారులకు సూచనలు చేస్తున్న ఆర్డీఓ మహేశ్వరరెడ్డి

పాటు వీఆర్వోలు తప్పనిసరిగా పాల్గొని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. తహసీల్దార్ నారాయణరెడ్డి, ఆర్ఐ రాఘవేంద్రప్రసాద్, వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

16 నుంచి రెవెన్యూ సదస్సులు

బేతంచెర్ల: మండలంలో నెలకొన్న భూ సమస్యల పరిష్కారానికి ఈనెల 16వ తేదీ నుంచి రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సూర్యప్రకాశ్ బాబు తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో డీటీ మధు, వీఆర్వోలు, సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. సదస్సు వివరాలను వెల్లడించారు. ఈ నెల 16వ తేద కొత్తపల్లె, 20న ఆర్‌ఎస్ రంగాపురం, 23న గూటుపల్లె, 27న హెచ్ కొట్టాల, 29న కొలుములపల్లె, 31న సీతారామాపురం, సెప్టెంబర్ 3న ముద్దవరం, 5న బేతంచెర్ల, 10న యంబాయి, 12 శంకలాపురం, 17న బుగ్గానిపల్లె, తండా, 19న గోరుమానుకొండ, తండా, 24న గోర్లగుట్ట, 26న అంబాపురం, 28న ఎం.పేండేకల్లు గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు రెవెన్యూ సదస్సులు జరుగుతాయన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ సూర్యప్రకాశ్ బాబు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బనగానపల్లె: మండలంలోని నందవరం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ గర్జప్ప తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అలాగే సబ్‌స్టేషన్ పరిధిలో రైతులకు సరఫరా చేసే ఉచిత విద్యుత్ ఉదయం 3 గంటల నుంచి 9 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సరఫరా చేయనున్నట్లు పేర్కొన్నారు. రైతులు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

కష్టపడితే విజయం వరిస్తుంది

కొలిమిగుండ్ల: కష్టపడి చదివితే తప్పక విజయం వరిస్తుందని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, ఎంఈఓ రాజయ్య అన్నారు. మంగళవారం కళాశాలలో ఫ్రెషర్స్ డేను ఇంటర్ విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. చదువుతోనే పేదిరిక నిర్మూలన సాధ్యపడుతుందని తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో ప్రతిభ దాగుంటుందని.. మరింత కష్టపడితే అనుకున్న లక్ష్యాలు సాధించవచ్చని సూచించారు. తల్లితండ్రులు పడుతున్న కష్టాలను గుర్తించి చదువుపై దృష్టి సారించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. బాగా చదువుకుని



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసులు

ఉద్యోగం సాధిస్తే ఆ కుటుంబ రూపురేఖలే మారిపోతాయని అన్నారు. మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేసి ప్రోత్సహించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అధ్యాపకులు శ్రీనివాసులురెడ్డి, బాల ఓబన్న తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



స్కూల్ బస్సును పరిశీలిస్తున్న ఎంవీఐ క్రాంతికుమార్

డోన్ రూరల్: ప్రైవేట్ పాఠశాల, కళాశాల బస్సులు నిబంధనలను ఉల్లంఘిస్తే యాజమాన్యాలపై కఠిన చర్యలు తప్పవని ఎంవీఐ టి.క్రాంతికుమార్ హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని స్కూల్, కాలేజీ బస్సులను తనిఖీ చేశారు. పర్మిట్ లేకుండా విద్యార్థులను తరలిస్తున్న శ్రీసుధ స్కూల్ బస్సుకు రూ.10వేలు, పర్మిట్, డ్రైవింగ్ లైసెన్సు లేకుండా నడుస్తున్న ద్రోణాచలం స్కూల్ బస్సుకు రూ.15వేలు జరిమానా విధించారు. రెండు బస్సులను సీజ్ చేసి ఆర్టీసీ డిపోకు తరలించారు. ఈ సందర్భంగా ఎంవీఐ మాట్లాడుతూ.. సోమవారం అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లె మండలంలో ఓ పాఠశాల బస్సు రోడ్డు ప్రమాదానికి గురై ఏడేళ్ల చిన్నారి మృతిచెందిందని తెలిపారు. 12 మంది గాయపడినట్లు చెప్పారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డ్రైవర్లకు సూచించారు. డ్రైవింగ్ లైసెన్సుతో పాటు వాహన రికార్డులు తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. రోడ్డు నిబంధనలు పాటించాలని తెలిపారు.

ఘనంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

కొలిమిగుండ్ల: జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని స్థానిక ఉన్నత పాఠశాలలో మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. గత ఏడాది ఆగస్టు 23న చంద్రయాన్–3 చంద్రుని దక్షిణ ధ్రువంపై ల్యాండ్ అయిన విషయం తెలిసిందే. ఈ విజయానికి గుర్తుగా ఏటా అంతరిక్ష దినోత్సవం నిర్వహించాలని ఇటీవల కేంద్రం ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా రామ్‌కో ఆధ్వర్యంలో అంతరిక్షంలో దేశం సాధించిన విజయాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి కష్టపడి దేశానికి పేరు తీసుకురావాలన్నారు. శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కంపెనీ వైస్ ప్రెసిడెంట్ సూర్యకాంత్, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం హుసేనయ్య, రామ్‌కో మైన్స్ జీఎం అజ్మల్, ఏజీఎంలు సతీష్, నరేష్, మురళి పాల్గొన్నారు.

చౌక దుకాణాల తనిఖీ

బేతంచెర్ల: మండలంలోని చౌక దుకాణాల్లో రేషన్‌కార్డుదారులకు సక్రమంగా రేషన్ పంపిణీ చేయాలని సివిల్ సప్లైస్ డీటీ రబ్బాని అన్నారు. మంగళవారం పట్టణంలోని చౌక దుకాణాలను తనిఖీ చేశారు. లబ్ధిదారులతో మర్యాదపూర్వకంగా మెలగాలని డీలర్లకు సూచించారు.

పండ్ల తోటలతో అధిక ప్రయోజనాలు



పండ్ల మొక్కలు పంపిణీ చేస్తున్న అధికారులు

ప్యాపిలి: పండ్ల తోటల సాగుతో అధిక ప్రయోజనాలు ఉన్నాయని ప్రకృతి వ్యవసాయ అదనపు జిల్లా అధికారి అబ్దుల్ సలాం అన్నారు. మండల పరిధిలోని జలదుర్గం గ్రామంలో రైతు ఉత్పత్తిదారుల సంఘం కలెక్షన్ సెంటర్‌లో పండ్ల మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రైతులు పండ్ల తోటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. అనంతరం గ్రామానికి చెందిన పలువురు రైతులకు మామిడి, నేరేడు, జామ, కొబ్బరి, మహాగని తదితర 6,500 మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దస్తగిరి, మార్కెటింగ్ మేనేజర్ మద్దయ్య, రైతు జమాల్ బాషా, సీఈఓ సుధాకర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కస్టమర్‌పై ఫైనాన్స్ ఉద్యోగుల దాడి

డోన్ టౌన్: కంతులు మొత్తం చెల్లించినా క్లియరెన్స్ సర్టిఫికెట్ ఇవ్వడం లేదని ప్రశ్నించడంతో కస్టమర్‌పై ఫైనాన్స్ కంపెనీ ఉద్యోగులు దాడి చేసిన ఘటన డోన్‌లో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు.. పట్టణంలోని తారకరామనగర్‌కు చెందిన సురేష్ కొత్త బస్టాండ్ ఫ్లైఓవర్ వద్ద ఉన్న శ్రీరామ్ ఫైనాన్స్‌లో బైక్ లోన్ తీసుకున్నాడు. వాయిదాల ప్రకారం కంతులు చెల్లించాడు. అయితే కంపెనీ నిబంధనలు ప్రకారం అపరాదం చెల్లించలేదు. తనకు క్లియరెన్స్ సర్టిఫికెట్ ఇవ్వాలని కొద్ది రోజులుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాడు. ఈ నెల 10వ తేదీ మరోసారి కార్యాయానికి వెళ్లి నిలదీశాడు. ఈ క్రమంలో మేనేజర్ జయరాం, సురేష్ మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో మేనేజర్ జయరామ్, ఉద్యోగి వంశీ ఆచారితో పాటు మరికొందరు కస్టమర్‌పై దాడి చేశారు. గాయపడిన సురేష్ డోన్ ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి చికిత్స తీసుకున్నాడు. మంగళవారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిరాదు చేశాడు. సీఐ ఇంతియాజ్‌బాషా విచారణ చేపట్టారు.

21న గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుకు ఇంటర్వ్యూ

డోన్ టౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హిస్టరీ సబ్జెక్టు గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుకు ఈ నెల 21వ తేదీ ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని కళాశాల ప్రిన్సిపాల్ భారతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ హిస్టరీలో కనీసం 55శాతం మార్కులతో ఉత్తీర్ణులైన వారు అర్హులని పర్కొన్నారు. యూజీసీ నెట్, ఏపీ సెట్, పీహెచ్‌డీ అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 21వ తేదీ బుధవారం ఉదయం 10:30 గంటలకు బయోడేటా, సర్టిఫికెట్లతో కళాశాలలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు.

సుంకులమ్మ ఆలయంలో హుండీ చోరీ

కోవెలకుంట్ల: మండలంలోని జోళదరాశి గ్రామంలో వెలసిన సుంకులమ్మ ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన హుండీని సోమవారం అర్ధరాత్రి దుండగులు ఎత్తుకెళ్లారు. స్థానికుల సమాచారం మేరకు.. ఆలయ అభివృద్ధి కోసం భక్తుల నుంచి విరాళాలు సేకరించేందుకు హుండీ ఏర్పాటు చేయగా గుర్తు తెలియని చోరీ చేశారు. హుండీలో సుమారు రూ. 20 వేలు నగదు ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. పోలీసులు విచారణ జరుపుతున్నారు.

విధి నిర్వహణలో బదిలీలు సర్వసాధారణం



ఏఎస్ఐ వెంకటనారాయణను సత్కరిస్తున్న పోలీసు సిబ్బంది

డోన్: ప్రభుత్వ ఉద్యోగులకు పదోన్నతులు, బదిలీలు సర్వ సాధారణమని పట్టణ సీఐ ఇంతియాజ్‌బాషా అన్నారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న వెంకటనారాయణ పదోన్నతిపై చిప్పగిరి పోలీస్‌స్టేషన్‌కు ఏఎస్ఐగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం సీఐతో పాటు ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి, కానిస్టేబుళ్లు ఆయన్ను ఘనంగా సత్కరించారు. ఆయన సేవలను కొనియాడారు.

విభిన్న ప్రతిభావంతులపై ఆదరణ చూపాలి

డోన్ టౌన్: విభిన్న ప్రతిభావంతులపై ప్రతి ఒక్కరూ ఆదరణ చూపాలని సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసు కమిటీ చైర్‌పర్సన్ తంగమణి అన్నారు. ఏపీ లీగల్ సర్వీసు కమిటీ ఆదేశాల మేరకు పట్టణంలోని విద్యా కేంద్రం అవరణలోని భవిత కేంద్రాన్ని ఆమె మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విభిన్న ప్రతిభవంతులకు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు, సేవలపై పిల్లల తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వివిధ కారణాల వల్ల అంగవైకల్యం పొందిన పిల్లలపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు. వారిని అవసరాలను గుర్తించాలన్నారు. అనంతరం పిల్లలకు బిస్కెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కోర్టు సిబ్బంది ఇందిర, సరిత, భవిత కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి తంగమణి

అంటువ్యాధులతో జాగ్రత్త



స్థానికులకు సూచనలు ఇస్తున్న కమిషనర్ జయరాం

డోన్: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని కమిషనర్ జయరాం స్థానికులను కోరారు. మంగళవారం పట్టణంలోని 29వ వార్డులో స్టాప్ డయేరియా వంద రోజుల కార్యక్రమంలో భాగంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటి పరిసర ప్రాంతాల్లో అపరిశుభ్ర వాతావరణం వల్ల అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. జ్వరం, డెంగీ, మలేరియా లక్షణాలు కనిపించిన వెంటనే వైద్య సిబ్బందితో సంప్రదించి ప్రభుత్వాస్పత్రిలో తగిన చికిత్స చేయించుకోవాలని సూచించారు. తడి, పొడి చెత్తలను వేర్వేరుగా మున్సిపల్ సిబ్బందికి అందజేయాలని కోరారు. ఆయన వెంట డీఈ రసూల్, ఏఈ సతీష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ బాషా, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

చెత్త సంపద కేంద్రాలతో పంచాయతీలకు ఆదాయం

బనగానపల్లె రూరల్: చెత్త సంపద కేంద్రాల ద్వారా పంచాయతీలకు ఆదారం వస్తుందని.. ఆ దిశగా పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు కృషి చేయాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగరాజు సూచించారు. స్థానిక పొదుపు భవనంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లకు జరుగుతున్న శిక్షణ మంగళవారం రెండో రోజు కొనసాగింది. నాగరాజు మాట్లాడుతూ.. గ్రామాల్లో పారిశుద్ధ్య కార్మికుల ద్వారా చెత్త సేకరణ చేపట్టాలని, సేకరించిన చెత్తను తడి,పొడి చెత్తగా వేరుచేసి వర్మీకంపోస్టు ఎరువుగా తయారు చేయాలన్నారు. వాటి విక్రయం ద్వారా పంచాయతీల ఆదాయం పెంచాలని తెలిపారు. అలాగే ప్రజలు ఇళ్లలోని చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా పంచాయతీ వారి చెత్త సేకరణ సైకిళ్లలోనే వేసేలా సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం మండలంలోని పాతపాడు గ్రామంలో ఏర్పాటు చేసిన వర్మీకంపోస్టు తయారీ కేంద్రం వద్దకు వారిని తీసుకెళ్లి వర్మీకంపోస్టు తయారీ విధానాలపై ట్రైనీ అధికారులు గురుప్రసాద్, శివశంకర్‌నాయక్, మహేశ్వరయ్యతో అవగాహన కల్పించారు. ఇన్‌చార్జ్ ఈఓఆర్డీ హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



పాతపాడు వర్మీకంపోస్టు యూనిట్ వద్ద అవగాహన కల్పిస్తున్న అధికారులు

రోడ్డుపైనే పార్కింగ్

కొలిమిగుండ్ల: స్థానిక ప్రధాన రహదారిలో వాహనదారులు ఇష్టానుసారంగా తమ వాహనాలను నిలుపుదల చేస్తున్నారు. గతంలో రోడ్డు ఇరుకుగా మారి ట్రాఫిక్ సమస్య తీవ్రంగా వేధిస్తుండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రధాన రహదారిని 60 అడుగుల వెడల్పు చేసి రోడ్డు డివైడర్ ఏర్పాటు చేయడంతో విశాలంగా మారింది. అయితే వాహనదారులు ఇష్టానుసారం పార్కింగ్ చేస్తుండంతో మళ్లీ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ మీదుగా తేరు మిద్దె వరకు రోడ్డుకు ఇరువైపులా ఎక్కడ పడితే అక్కడ వాహనాలను ఆపి షాపింగ్‌లకు వెళుతున్నారు.



రోడ్డుపై వాహనం నిలిపి షాపింగ్ వెళ్లిన వాహనదారుడు

వరిలో యాజమాన్య పద్ధతులపై అవగాహన

కోవెలకుంట్ల: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు చేసే రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని కోవెలకుంట్ల వ్యవసాయ సహాయ సంచాలకులు సుధాకర్ సూచించారు. మంగళవారం మండలంలోని వెలగటూరు గ్రామంలో వరిపంటలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. వరి సాగులో మోతాదుకు మించి రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు వినియోగించవద్దన్నారు. తక్కువ మందులు వేసిన దిగుబడులు సాధించడం వల్ల రైతులకు అన్ని విధాలా ఉపయోగకరమన్నారు. వరినాట్లకు ముందు నారును అరగంట సేపు సుడోమోనాస్ ద్రావణంలో నానబెట్టిన తర్వాత నాట్లు వేయడం వల్ల వివిధ దశల్లో ఆశించే అగ్గి తెగులు నివారించుకోవచ్చని తెలిపారు. నారు కొనలు తుంచడం వల్ల కాండం తొలుచుపురుగు, ఉల్లికోడు, సంబంధిత పురుగు గుడ్ల సముదాయాన్ని అరికట్టవచ్చని పేర్కొన్నారు. మండల వ్యవసాయాధికారి నిరంజన్, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



యాజమాన్య పద్ధతులను వివరిస్తున్న ఏడీఏ

సేవతోనే సమాజంలో గుర్తింపు



ఎంపీడీఓ, ఎస్ఏను సత్కరిస్తున్న ఎంపీపీ, సర్పంచ్‌లు

బేతంచెర్ల: ప్రభుత్వ ఉద్యోగులు బాధ్యతగా సేవలు అందిస్తే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, ఎంపీడీఓ వెంగన్న అన్నారు. ఎంపీడీఓ రవిప్రసాద్ అనంతపురం జిల్లాకు, సీనియర్ అసిస్టెంట్ శేక్షావలి విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖకు బదిలీ కావడంతో మంగళవారం సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎంపీపీ, ఎంపీడీఓ, సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది వారిని ఘనంగా సత్కరించారు. వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ వెంకట రంగనాయక్, సూపరింటెండెంట్ దస్తగిరిబాబు పాల్గొన్నారు.